



రెడీ-గెట్-సెట్-గో....

అందరూ హఠాత్తుగా కట్టలు తెంచుకున్న నదిలా పరుగెత్తారు. ఒకరిని దాటాలని ఒకరు, అందరికంటె ముందుకి వెళ్ళాలన్న పట్టుదలతో, శక్తినంతా ఉపయోగించి పెదాలు బిగించి బెదరిన లేళ్ళ సమూహంలా....

జయలక్ష్మి కూడా పరుగెడుతోంది.

ఎంత పెద్ద అంగలు వేసినా ఎంత వేగంగా పరుగెడుతున్నా ఎవ్వరినీ అధిగమించలేకపోతోంది. అందరూ తనకన్నా ముందే ఉన్నారు. ఎవరూ తనను వాళ్ళకంటె ఒక్క అంగుళం కూడా ముందుకి పోనీయడం లేదు. తన శక్తి సన్నగిలిపోతోంది. అలుపు పొంగుకొస్తోంది.

ఊహు తన వల్ల కాదు. ఈ పరుగు పందెంలో తను గెలవలేదు. ఓడిపోవడం తథ్యం!

ఆశ్చర్యం ఏమిటంటే తనే ఆఖర్లో మిగిలిపోయింది.

జానకి ఫస్ట్!

చంద్రకళ సెకండ్!

జూలీ థర్డ్!

ఆ తరువాత ఇంకెందరో! ఆఖర్లో తను-

అందరూ తనను చూసి నవ్వుతున్నారు.

"ఫరవాలేదోయ్! ఇటునుంచి ఫస్ట్ నువ్వేలే!" హేళనగా అంది రాధిక.

తను సిగ్గుపడిపోయింది.

అవమానం, దుఃఖం తనను దహించి వేసినయ్.

ఇదేమిటి?

ఇంత ఘోరంగా ఎలా వెనకబడిపోయింది తను? ఇంత దారుణంగా ఎలా ఓడిపోయింది.

ఫస్ట్ రాలేకపోయినా ఫరవాలేదు. కానీ

ఆఖరిస్థానం రాకుండా ఉంటే ఇంత బాధగా ఉండేదికాదు.

అందరూ పట్టుదలతో ప్రథమస్థానం కోసం కాకపోయినా, ఆఖరిస్థానం రాకూడదన్నట్లు పరుగెత్తేరు.

సాధించేరు.

కానీ తను మాత్రం....

కొద్దిరోజులపాటు ఆ అవమానం నుంచి కోలుకోలేకపోయింది జయలక్ష్మి.

ఆ తరువాత మళ్ళీ ఎప్పుడూ ఆటల్లో పాల్గొనకూడదని నిశ్చయించుకుందామె.

కానీ పోటీ మళ్ళీ చదువులో ప్రారంభమయింది.

అందరికంటె మంచి మార్కులు కనీసం ఒక్కసారయినా తెచ్చుకోవాలని ప్రారంభించిన ప్రయత్నాలు వరుసగా వమ్మయిపోతూంటే మనసు విలవిలలాడి పోయేది.

ఎప్పటికప్పుడు ఓటమే.

ఇంటర్మీడియెట్ పరీక్షలు రాస్తు న్నప్పుడు తనకు వచ్చిన ఓ అనుమానం నివృత్తిచేసుకోవడానికి తనముందు కూర్చున్న జయశ్రీని పలుకరించింది. కాని జయశ్రీ సమాధానం చెప్పలేదు.

"నాది కంప్లీటయాక చెప్తాను. డిస్టర్బ్ చేయకు...." అంది చిరాగ్గా.

అప్పుడు అర్థమయింది తనకి.

ఇదీ పరుగు పందెమే !

ఎవరి సంగతి వారే చూసుకోవాలి.

స్నేహం, బంధుత్వం వగైరాలేమీ పనికిరావిక్కడ.

పక్కనున్న వారిని ఓడించడమే ధ్యేయం.

పక్కనున్న దెవరయినా కానీ ! పందెం గెలుచుకోవడం ముఖ్యం గానీ మరింకే విషయమూ ముఖ్యం కాదు.

డిగ్రీ పరీక్షల్లో కూడా తను అందరినీ ఓడించలేకపోయింది. ఎంతో కష్టపడి రాత్రింబగళ్ళు చదివినా కూడా ముప్ఫయ్యో స్థానం వచ్చింది.

అయితే ఈసారి అదివరకులా దుఃఖం రాలేదు.

తను చాలామంది కంటె ఎక్కువ మార్కులు సంపాదించగలిగానన్న సంతృప్తి తనను ఆదుకుంది.

ఆ తరువాత ఎమ్మెస్సీకూడా అయి పోయింది.

అక్కడా అంతే ! చాలామంది తనను ఓడించేశారు.

ఆ తరువాత ఉద్యోగాల వేట ప్రారంభమయింది.

ఇంట్లో ఆర్థికసమస్యల వల్ల తను ఉద్యోగం చేయక తప్పదు.

హైద్రాబాద్‌లోని ఓ వుమెన్స్ కాలేజీలో లెక్చరర్ పోస్టుకి అప్లయ్ చేసింది.

తీరా ఇంటర్‌వ్యూ కెళ్ళేసరికి రెండు పోస్టులకూ నూట ఇరవై మంది అభ్యర్థినులు వచ్చారు.

పందెం మళ్ళీ ప్రారంభమయి పోయింది.

తనకు. గుండెల్లో సన్నగా భయం ప్రారంభమయింది. ఈ పందెంలో తను నెగ్గగలదా? ఎవరిని చూచినా తనకంటే సమర్థులుగానే కనబడుతున్నారు. చాలా మంది గుంపుగా నిలబడి ఇలాంటి ఇంటర్‌వ్యూలు తమ కేమీ కొత్తకానట్లు నవ్వుతూ, తుళ్ళుతూ మాట్లాడుకుంటు న్నారు. తను పలుకరించేవాళ్ళు లేక, తనకు చొరవతీసుకునే ధైర్యంలేక ఒంటరిగా ఓ పక్కగా నిలబడిపోయింది.

ఇంటర్‌వ్యూ ముగిసింది.

తనకు ముందునుంచీ తెలిసిపోతూనే ఉంది.

తను ఇక్కడా ఓడిపోయింది.

ఆ తర్వాత మరెన్నో ఇంటర్‌వ్యూలు.

అన్నిట్లో ఓటమే.

తను బ్రిలియంట్ కాదు. డాషింగ్ లేదు. విశిష్టమయిన ఆకర్షణ లేదు. మరింకే ఇతర ఎక్‌స్ట్రాకరిక్యులర్ యాక్టివిటీస్ కూడా లేవు. మరింక ఓడిపోక ఏంచేస్తుంది?

చివరకు హైదరాబాద్‌లోని ఓ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో ఉద్యోగం దొరికింది. అక్కడా ఓడిపోయిందిగాని సెలక్టయిన వారిలో ఓ యువతి రాకపోవడంవల్ల ఆ అవకాశం అనుకోకుండా తనకు దక్కింది.

అక్కడ జీవితం తనకెంతో ఆనందం కలిగించింది.

నగరానికి దూరంగా ఇనిస్టిట్యూట్ ఉంది. విశాలమయిన ఆ కాంపౌండ్ లోనే క్వార్టర్స్ కూడా ఉన్నాయ్.

ఒంటరిగా క్వార్టర్స్‌లో ఉన్నది తనొక్కర్తే.

మిగతావారందరూ కుటుంబాలతో ఉన్నవారే.

కొద్దిమంది స్వస్థలం హైదరాబాద్ కావడంవల్ల ఇన్‌స్టిట్యూట్ బస్‌లో రోజూ నగరానికెళ్ళి వస్తూంటారు.

తనకు ఆ ఉద్యోగం సరయిన సమయంలో దొరికింది. ఆర్థికంగా ఎంతో క్లిష్టపరిస్థితిలో ఉన్న తన తల్లిదండ్రులను తను ఆదుకునే అవకాశం లభించింది. తనకొచ్చే జీతంలో మూడొంతులు వారికే పంపేది. మిగతాదాంట్లోనే తను సరిపెట్టుకునేది.

అప్పుడప్పుడు తనతో క్వార్టర్‌కి తన డిపార్ట్‌మెంట్‌కి సంబంధించిన సీనియర్ అసిస్టెంట్స్ వచ్చి కాసేపు కబుర్లు చెప్పుకున్నాక 'టీ'తాగి వెళ్ళిపోతూండేవాళ్ళు.

వాళ్ళు ఇంట్లో ఉన్నంతసేపూ తనకెంతో ఉల్లాసంగా ఉండేది. ఎప్పుడూ ఇలా మాట్లాడ్డానికోవ్యక్తి ఉంటే ఒంటరితనం తననేం చేయగలదు?

ఆ రోజు లాబ్ కెళ్ళేసరికి శ్రీదేవి అందజేసిన శుభలేఖచూసి ఆశ్చర్యపోయింది తను.

ఆమెకీ తన డిపార్ట్‌మెంట్‌లోనే పని చేస్తున్న కరియత్‌కీ వివాహం.

ఇనిస్టిట్యూట్‌లో నిజానికి అందరూ

ఒకరితో ఒకరు చనువుగానే ఉంటారు. కాని ఆ చనువుని ఇలా మలచుకోవడం శ్రీదేవితో ప్రారంభమయింది. వారిద్దరికీ ఆ ఆలోచన ఎలా వచ్చిందా అని తన మీమాంస.

తనఆలోచనలకు ఇంద్రాణి నవ్వింది.

"అంత పెద్ద విచిత్రమేముందిందులో? మన వయసుకి మనం ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు చేసుకుంటాం పెళ్ళి? ఈ రెండుమూడేళ్ళల్లో త్వరపడి ఎవరో ఒకర్ని చేసుకోకపోతే ఆ తరువాత ఇక పెళ్ళికావడమే కష్టం...."

తను తెల్లబోయింది.

ఇంతవరకూ తనీవిధంగా ఆలోచించనేలేదు. తనవయసునే మర్చిపోయింది తను. తన తల్లిదండ్రులుకూడా రెండు మూడు సంబంధాలు చూసి విసిగి పోయారు. అక్కడా పరుగుడు పందెమే. తనకు ఇంచుమించుగా కుదిరిన సంబంధాన్నికూడా కట్నంతో గెల్చుకుని లాక్కున్నారు. మళ్ళీ ఓటమిని చవి చూడక తప్పలేదు.

ఇప్పుడు ఇంద్రాణి మాటల ప్రకారం తనకు వివాహం జరగాలంటే ఎంతో కాలం మిగల్లేదు.

ఈ కొద్ది రోజుల్లోనూ కట్నాల రేస్‌లో గెలచి తనకు తగ్గ కుర్రాడిని తల్లిదండ్రులు వెదికి వివాహం చేస్తారనుకోవడం అవివేకం.

కాని మరి తనుమాత్రం చేయగలిగిందేముంది?

పోనీ తను శ్రీదేవిలా ఎవర్నయినా ప్రేమించి వివాహం చేసుకుంటే? అలాంటి అర్హతలుగల వ్యక్తులెవరున్నారసలు ఈ ఇన్‌స్టిట్యూట్‌లో. బయటి ప్రపంచంతో తనకెలాగు సంబంధంలేదు.

ఇనిస్టిట్యూట్‌లో బెనర్జీ ఉన్నాడు గానీ అతను ఎవరితోనూ మాట్లాడడు.

శ్రీరామ్ అందరితోనూ చనువుగానే ఉంటాడు గానీ అతను భగ్న ప్రేమికుడు. అసలు ఇక వివాహమే చేసుకోడట. రోజులు గడిచిపోతున్నాయ్. క్రమేపీ మళ్ళీ ఈ ఆలోచనలన్నీ అడుగునబడి పోయినయ్.

కొత్తగా ఇన్‌స్టిట్యూట్‌లో చేరిన మోహన్ తన దగ్గరకొచ్చి తనని తను పరిచయం చేసుకుంటూంటే ఆమెలోని ఆలోచనలు, కోరికలు అన్నీ హఠాత్తుగా మేల్కొన్నాయి మళ్ళీ.

బహుశా అతనికీ తన వయసే ఉంటుందేమో!

గొప్ప అందగాడు కాదుగానీ గొప్ప ఆకర్షణ ఉందతన్లో.

"మేడమ్! నా సంగతి చెప్పమంటారా? మోస్ట్ అన్‌ఫార్చునేట్ ఫెలోని నేను. స్పోర్ట్సులో ఫస్ట్ వచ్చేవాడిని మా స్కూల్లో. కాలేజ్ కొచ్చేసరికి తీరా స్పోర్ట్సుడే నాడు ఏంజరిగిందనుకున్నారూ? నూటనాలుగు జ్వరం! దాంతో ప్రైజులన్నీ మిగతావాళ్ళు కొట్టుకుపోయారు. వరుసగా మూడేళ్ళూ అలాగే జరిగింది.

నా కెంత ఏడుపొచ్చేదో! పోనీ చదువులో నయినా లక్ ఉందా అంటే అక్కడా చుక్కెదురే! ఎమ్మెస్సీలో క్లాస్ రావాల్సిందసలు! పరీక్ష కెళ్తోంటే యాక్సిడెంట్! కాలు చట్నీ అయిపోయింది. హాస్పిటల్ కెళ్ళి కట్టుకట్టించుకుని ఎగ్జామినేషన్ కొచ్చేసరికి టోలెడాలస్యం అయింది. దాంతో ఫస్ట్ క్లాస్ గోవిందా! ఇలా ఒకటేమిటి లెండి- ప్రతి విషయంలోనూ 'బాడ్ లక్' వెంబడిపడి తరుముతూ వచ్చింది ఇంతవరకూ! ఇక ముందు ఎలా వుంటుందో తెలీదు మరి..."

అతని మాటలు వింటూంటే అతని జీవితానికీ తన జీవితానికీ సామ్యం ఉన్నట్లనిపించింది జయలక్ష్మికి.

తన జీవితం ప్రతి అడుగునా ఓటమి చవిచూసింది.

అతని జీవితం అడుగడునా దురదృష్టం పాలయింది.

తను ఆశించినదానికంటె త్వరగానే అతనితో సన్నిహితత్వం ఏర్పడిపోయిందామెకి.

"రోజూ బస్‌లో సిటీకెళ్ళి రావాలంటే చిరాకుగా ఉంది మేడమ్! మీరు చాలా లక్కీ! కాంపస్‌లోనే క్వార్టర్స్ సంపాదించారు...."

జయలక్ష్మి నవ్వింది.

"మీరు ఒక్కరే ఎలా టైమ్‌పాస్ చేస్తారు ఇంట్లో?" అడిగాడతను.

"నాకే అర్థంకావటంలేదది! ఒకో రోజు ఏదో పుస్తకం చదువుతూ గడిపేస్తాను. మరో రోజు రేడియో ముందు- ఇంకోరోజు ఆలోచిస్తూనూ-"

"అలా టైమ్ వృథా చేసేబదులు అప్పుడప్పుడు నన్ను భోజనానికి పిలువకూడదూ? కనీసం అప్పుడప్పుడయినా ఆ హోటల్ కూడు నుంచి రక్షించినవారవుతారు గదా?"

జయలక్ష్మి ఆనందంతో ఉప్పొంగిపోయింది.

"నేను ఇన్వైట్ చేయాలా ఏమిటి? మీ ఇష్టమొచ్చినప్పుడల్లా ఇంటికొచ్చి భోజనంచేసే చనువు లేదా నా దగ్గర మీకు?"

అతను నవ్వేడు.

"ఉందనుకోండి! అయినాగాని పర్మిషన్ తీసుకోవడం మంచిదని...."

ఆ సాయంత్రమే ఆమెతోపాటు ఆమె క్వార్టర్‌కి వెళ్ళాడను. జయలక్ష్మి త్వర త్వరగా ఇద్దరికీ 'టీ' తయారుచేసి త్రాగటం పూర్తయ్యాక వంట ప్రారంభించింది.

మోహన్ కూడా కుర్చీ వంటగదిలోకి తెచ్చుకుని సమీపంగా కూర్చున్నాడు.

"నా గురించి మీరు శ్రమపడుతున్నప్పుడు మిమ్మల్ని ఎంటర్‌టైన్ చేయడం నా డ్యూటీగదా! అందుకే మీ దగ్గరే కూర్చుని కబుర్లు చెప్తాను! ఏమంటారు?"

"సరే!" నవ్వాపుకుంటూ అంది జయలక్ష్మి.

ఆ రాత్రి అతనితో కలిసి భోజనం చేస్తూంటే వింత అనుభూతి కలిగిందామెకి.

ఈ అనుభూతి శాశ్వతం అవుతుందా?

తామిద్దరూ శాశ్వతంగా ఒకటవగలరా? అతను తనను జీవిత భాగస్వామిగా అంగీకరిస్తాడా?

మరికొన్ని రోజులు గడచిపోయినయ్.

రానాను మోహన్‌తో చనువు ఎక్కువవుతూ వచ్చిందిగాని తన మనసులోని విషయం ప్రస్తావించాలంటే సిగ్గుగా ఉందామెకి. ఒకటి రెండుసార్లు అతనే కావాలని అతని వివాహం గురించి మాట్లాడేడు.

"నాతోపాటుగా ఇక్కడే ఉద్యోగం చేసే అమ్మాయిని చేసుకోవాలని నాకుందండీ! కానీ మా వాళ్ళేమో మేనరికం_గీనరికం అంటూ హడావుడి చేస్తున్నారు!" ఆ సమయంలో తనెంత ప్రయత్నించినా నోరు కదపలేకపోయింది. ఏదో భయం.

ఆ సంభాషణను పొడిగించి ఉన్నట్లయితే తప్పక అది తామిద్దరి వివాహం గురించిన నిర్ణయానికి దారితీసిఉండేది. ఆ విషయం అక్కడితోనే ముగిసింది. తమ డిపార్ట్‌మెంట్‌లో కొత్తగా చంద్రిక ప్రభావతులు చేరడంతో మోహన్ తనతో గడిపే సమయం తగ్గిపోయింది. ఈ విషయం కలవరం కలిగించింది జయలక్ష్మికి.

వారం రోజుల్లోనే వారిద్దరూ మోహన్‌తో ఎన్నో సంవత్సరాల పరిచయం ఉన్నట్లు మసలడం ఆశ్చర్యంగా ఉంది.

వారిద్దరిదీ కూడా ఇంచుమించుగా తనదే వయసు. ఇద్దరికీ వివాహం కాలేదు.

జయలక్ష్మి గుండెలు వేగంగా కొట్టుకున్నయ్.

ఒకవేళ ఇక్కడా పందెం ప్రారంభమవలేదు కదా?

భగవంతుడా!

అఖరికి ఇక్కడ - ప్రేమించి వివాహం చేసుకోవాలనుకొన్నచోట కూడానా?

ఒకవేళ ఇదే నిజమయితే తను ఓడిపోవడం తధ్యం.

ఎందుకంటే తను వారిద్దరికంటే అందంగా లేకా కాదు, వారికంటె ఎక్కువగా మోహన్‌ని ఆకర్షించలేకా కాదు.

కానీ ఇది తన తలరాత!

ఓటమి తను చిన్నప్పటినుంచీ పొందుతొన్న హక్కు!

మోహన్ అదివరలా జయలక్ష్మి ఇంటికి రాలేదు.

జయలక్ష్మికి పట్టుదల హెచ్చింది.

మిగతా పందేల సంగతి వేరు.

ఇక్కడ మాత్రం తను గెలవాలి. చంద్రిక ప్రభావతుల నిద్దరినీ ఓడించాలి. లేకపోతే తన జీవితమే ధ్యేయం

లేకుండా గడపాల్సి వస్తుంది. వీలయినంత త్వరలో తను మోహన్‌తో మాట్లాడాలి. భయం, సిగ్గూ అన్నీ వదిలేసి తమ వివాహం గురించి తేల్చుకోవాలి.

ఆ అవకాశంకోసం ఆత్రుతగా ఎదురు చూడసాగిందామె.

"కొత్త స్నేహితురాండ్రు దొరికేసరికి పాతవారిని మర్చిపోయారా ఏమిటి ?" ఓ రోజు అతను వంటరిగా తారసపడినప్పుడు నవ్వుతూ అడిగింది జయలక్ష్మి.

అతను దోషిలా ఆమెవేపు చూశాడు.

"అబ్బే ! అదేం లేదు. మనకున్న స్నేహం మరెవరితోనూ ఏర్పడదు."

"అలాగయితే మరి మా ఇంటికి రావడం మానేశారెందుకని ?"

"ప్రత్యేకంగా కారణం ఏమీలేదు. ఇవాళ రమ్మంటే వచ్చేస్తాను."

జయలక్ష్మికి ఆనందంతో ఉక్కిరి బిక్కిరయింది. అతనిని ఇంక ఏ మాత్రం ఉపేక్షించకూడదు. ఇవాళే రాత్రికి అన్నీ నిర్ణయమయిపోవాలి.

ఆ సాయంత్రం ఆమెతోపాటు ఆమె క్వార్టర్స్‌కి వచ్చాడతను.

ఇద్దరూ బాల్కనీలో చాలా సేపు మాట్లాడుతూ గడిపేరు.

భోజనాలు ముగించేసరికి టైము ఎనిమిది దాటింది.

"ఇంక నేను వెళ్తాను మరి...." అన్నాడతను టైమ్ చూసుకుంటూ.

జయలక్ష్మి ఉలిక్కిపడింది.

అంతకు ముందెప్పుడూ అతను పది గంటలలోపు వెళ్తాననలేదు.

"ఏమిటివాళ తొందరపడుతున్నారు?" అడిగిందామె.

"మరేమీ లేదు. మీకు అంతసేపు డిస్టర్బెన్స్ ఎందుకని...."

"ఇవాళ మిమ్మల్నో విషయం అడగాలని...." ఆ తరువాత మాట్లాడలేకపోయిందామె. సిగ్గు ఆమెని నోరు మెదపనీయడం లేదు.

"ఏమిటది ?" ఆశ్చర్యంగా అడిగాడతను.

"అదే....మా ఇంట్లో నా వివాహం గురించి ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ విషయమే...."

అతనికి అర్థమయింది.

"జయలక్ష్మి ! మీ కీ విషయం చెప్పాలంటే నాకే సిగ్గుగా ఉంది ! మిమ్మల్ని ఇక్కడ చూసిన మొదటి రోజే మిమ్మల్ని వివాహం చేసుకోవాలన్న కోరిక నాలో నాటుకుపోయింది. అందుకే మీకు అంత త్వరగా దగ్గరయేను. కానీ ఈమధ్య అనుకోకుండా ఓ సంఘటన జరిగింది. అప్పటినుంచీ నన్ను నేను నిందించుకోని రోజు లేదు." మాట్లాడడం ఆపి ఆమెవంక చూశాడతను.

జయలక్ష్మికి ఏమీ అర్థం కావడం లేదు.



"చంద్రిక సంగతి మీకు తెలిసిందే కదా! ఆమె నాతో చాలా చనువుగా ఉంటుంది. ఓరోజు ఇన్‌స్టిట్యూట్‌నుంచి ఇంటికి వెళ్ళేటప్పుడు ఆమె కూడా నాతోపాటు ఆబిడ్స్‌దగ్గర దిగిపోయింది. ఇద్దరం కాఫీ తాగాం. సినిమాకు వెళ్దామని అడిగిందామె. సినిమాకు వెళ్ళాం. ఆ తరువాత ఆమె బలవంతం మీద రోజూ షికార్లు చేయడం అలవాటయిపోయింది. ఒకరోజు ఆమె నా గదికొచ్చింది. తప్పెవరిదేనా కానీండి, ఆ రోజు ఇద్దరం శారీరకంగా ఒకటయిపోయేం. ఈ పరిస్థితిలో ఇద్దరం వివాహం చేసుకోబోతున్నాం! నేనెంత తెలివితక్కువగా ఎందుకు ప్రవర్తించానో నాకే తెలీదు. నిజానికి ఆమెను నేను ప్రేమించలేదు. మా ఇద్దరిమధ్యా మనకున్నంత చనువూ లేదు. అంతా అనుకోకుండా జరిగిపోయింది..." చెప్పంట ఆపాడతను.

జయలక్ష్మి చలనం లేకుండా కూర్చుండిపోయింది.

అతను లేచి శెలవు తీసుకుని వెళ్ళిపోవడం ఆమెకేమాత్రం తెలీదు.

ఆమె కళ్ళముందు ఓ పరుగుపందెం కనబడుతోంది.

తనూ చంద్రికా ప్రభావతీ పరుగెడుతున్నారు.

తనే ముగ్గుర్లోకి ముందు ఉంది. కానీ—

ఆఖరిక్షణాల్లో చంద్రిక ఇద్దరినీ దాటి ముందుకు వెళ్ళిపోయింది. పందెం గెలుచుకుంది.

తను మామూలుగానే వెనుక—